క్లుప్తంగా

సంప్రదాయబద్ధంగా సంక్రాంతిని జరుపుకొందాం



వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న సీఐ చైతన్యకృష్ణ

కరప: సంక్రాంతి పేరుతో యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా, జూదాలకు దూరంగా సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సీఐ చైతన్యకృష్ణ పేర్కొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌ఐ టి.సునీత మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల నుంచి 8 వాలీబాల్ జట్లు లీగ్ పద్ధతిలో ఈ పోటీలలో పాల్గొంటున్నాయన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలను వివరించారు. అలాగే విద్యార్థినులకు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌పై సీఐ అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ వి.సూరిబాబు, హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, పీడీ కె.శ్రీనివాసరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెలికం సలహాదారుల కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

బోట్‌క్లబ్ : స్థానిక మెయిన్ రోడ్డులోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో బుధవారం టెలికం సలహాదారుల సమావేశం నిర్వహించారు. సభ్యులు ఎంఎస్ ఆర్‌వీ సత్యనారాయణ, దొడ్డి దుర్గాప్రసాద్, గట్టి వేంకటేశ్వరరావు, గేదెల వెంకట్రావు, మేకల కృష్ణ, అలుచూరి వరప్రసాద్ పాల్గొని బీఎస్‌ఎన్‌ఎల్ అభివృద్ధికి పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు టి.నాగరాజు, రాజశేఖర్, సైదా నాయక్, భమిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధన్వంతరిగా సీతారామస్వామి



బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రతమహోత్సవాలు, రజత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ధన్వంతరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

లక్ష్మీహయగ్రీవునిగా వేణుగోపాలస్వామి



బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజిత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బుధవారం లక్ష్మీహయగ్రీవ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు.

'గేమ్ చేంజర్' మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కాకినాడ రూరల్: గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు వెళ్లి వస్తూ రంగంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాకినాడ రాజేశ్వరి నగర్‌కు చెందిన అరవపల్లి మణికంఠ, అశోక్ నగర్‌కు చెందిన తోకాడ చరణ్ కుటుంబ సభ్యులకు రామ్‌చరణ్ తరపున చెరో ఐదు లక్షల రూపాయలు చెక్కులను బుధవారం అందించారు. కార్యక్రమంలో చిరంజీవి యువత ప్రతినిధులు ఏడిద బాబీ, కత్తిపూడి బాబీ తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ చక్రవ్యూహం



మెయిన్ రోడ్‌లో సగభాగం వాహనాల పార్కింగ్‌కే..

- నగరాన్ని చుట్టుముట్టనున్న ట్రాఫిక్ కష్టాలు
- పండగల వేళ నగర వాసుల్లో కలవరం
- కెనాల్ రోడ్ నిర్మాణ పనుల నేపథ్యంలో మరింత రద్దీ
- పోలీసుల ప్రత్యేక కార్యాచరణ
- నియంత్రణ కట్టుదిట్టమైన చర్యలు

కాకినాడ క్రైం: పండుగలొస్తే నగర వాసుల్లో కలవరం మొదలవుతోంది. నగరంలోని ప్రధాన మార్గాల్లోకి రావాలంటేనే ఓ ప్రయాస. కాలు కదిపేందుకైనా పడరాని పాట్లు పడాలి. ప్రయాణం ద్విచక్రవాహనంలోనో కారులోనో అయితే ఆ బాధ వర్ణనాతీతం. సరదా కోసమో షాపింగ్ కోసమో ఇంటిల్లిపాదీ ఓ వాహనంలో వస్తే ట్రాఫిక్ సుడిగుండం నుంచి ఏ వేళకు బయట పడతామో తెలియని పరిస్థితి. సామర్లకోట–కాకినాడలను అనుసంధానం చేస్తున్న కెనాల్ రోడ్‌లో కొంత భాగంలో మరమ్మతు పనులు జరుగుతుండడమే అందుకు కారణం. ట్రాఫిక్ వెతలు గట్టెక్కించి పండుగలోని ఆహ్లాదాన్ని నింపేందుకు నగర ట్రాఫిక్ విభాగం సర్వశక్తులు ఒడ్డుతోంది. అందులో భాగంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రఘువీర్ పర్యవేక్షణలో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు నగర ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నూని రమేష్, దానేటి రామారావు తెలిపారు.

వందమందితో బందోబస్తు

పండుగ వేళ ట్రాఫిక్ నియంత్రణకు వంద మంది సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్–1, 2 పరిధిలో వీరు విధులు నిర్వర్తించనున్నారు. ఒక డీఎస్పీ సహా ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు ఈ బందోబస్తులో పాలుపంచుకుంటున్నారు. నేటి నుంచి పది రోజుల పాటు 24 గంటల వ్యవధిలో షిఫ్టు డ్యూటీలలో వీరు విధుల్లో కొనసాగనున్నారు.

వ్యాలెట్ పార్కింగ్‌కు ప్రాధాన్యం

నగర ట్రాఫిక్ వ్యవస్థను పార్కింగ్ సమస్య ఇబ్బంది పెడుతోంది. నగరంలో నానాటికీ పెరుగుతున్న వ్యాపార సముదాయాలు, పెరిగిన వాహనాలు పార్కింగ్ సమస్య ఉత్పన్నమవడానికి కారణం అవుతున్నాయి. నూతనంగా ఏర్పాటవుతున్న షాపింగ్ మాళ్లకు సెల్లార్ పార్కింగ్ తప్పనిసరి చేశారు. అయితే పాత వ్యాపార సముదాయాలకు, సెల్లార్ పార్కింగ్ సరిపోని షాపింగ్ మాళ్లకు వ్యాలెట్ పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు యాజమాన్యాలకు సూచిస్తున్నారు. ఈ విధానంలో మాల్‌కి స్వల్ప దూరంలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించి సిఫార్సు చేస్తారు. వ్యాపారులు ఓ ప్రత్యేక వ్యక్తిని నియమించి వినియోగదారుడు షాపింగ్‌కి వస్తే అతడి వద్ద నుంచి వాహనాన్ని తీసుకొని భద్రంగా పార్కింగ్‌కి తరలిస్తారు. షాపింగ్ ముగించుకొని వెళ్లే సమయంలో అంతే భద్రంగా వాహనాన్ని అప్పగిస్తారు.

అదనపు సెక్యూరిటీ.. సీసీల నిఘా...

షాపింగ్ మాళ్లు తమ దుకాణాల ఎదుట రద్దీని నియంత్రించేందుకు అదనపు భద్రతను నియమించుకొని సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకునేలా ఆదేశాలిచ్చారు. డీఎస్పీ ఆదేశాలతో సీఐలు రమేష్, రామారావులు యాజమాన్యాలతో ఆ దిశగా చర్చలు జరుపుతున్నారు.

స్టాపర్ల ఏర్పాటు...

నగర పరిధిలో ఇప్పటికే 100 స్టాపర్లు ఏర్పాటు చేశారు. దుకాణాలకు ఆనుకుని ఉన్న ప్రదేశాలను ట్రాఫిక్ కోసం నిర్దేశించి అవి దాటి వాహనాలు నిలిపేవారిపై చలానాలు విధిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. భారీ వాహనాలు నగరంలోకి రానివ్వకుండా ప్రత్యేక మార్గాల ద్వారా మళ్లిస్తున్నారు.

కెనాల్ రోడ్డు మరమ్మతుతో రద్దీ...

సామర్లకోట–కాకినాడను అనుసంధానిస్తున్న కెనాల్ రోడ్డు మరమ్మతులతో నగరంలో ట్రాఫిక్ రద్దీ భారీగా పెరిగింది. నగరానికి సంబంధం లేకుండా గతంలో ఈ వాహనాలు అన్నీ ఆ రోడ్ గుండా సామర్లకోట, ఆ రహదారి వైపు వెళ్లేవి. అయితే మరమ్మతుల నేపథ్యంలో వేలాది వాహనాలు నగరంలోకి వస్తున్నాయి. ఆ వాహనాలు ఉండూరు వంతెన, అచ్చంపేట కూడలి, సర్పవరం, భానుగుడి మీదిగా నగరంలో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఏడీబీ రోడ్‌లో ముమ్మర తనిఖీలు కొనసాగిస్తున్నారు.



కాకినాడ మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన కోన్‌లు

మెయిన్ రోడ్ ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి



కాకినాడ మెయిన్ రోడ్ ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వాణిజ్యపరంగా నగరంలోనే అత్యంత రద్దీ ప్రాంతం ఇది. ఇక్కడి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సమర్థవంతంగా జరిగితే యావత్ నగర ట్రాఫిక్ నియంత్రణలో ఉంటుంది. పార్కింగ్ ప్రధాన సమస్య కాగా, ఖాళీ స్థలాలన్నీ జల్లెడ పడుతున్నాం. వ్యాపారులకు పార్కింగ్ కోసం సిఫార్సు చేస్తున్నాం. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపేసి క్రమంగా పెట్టమన్నందుకు పోలీస్, వ్యాపార సముదాయాల సెక్యూరిటీపై జులుం ప్రదర్శించడం భావ్యం కాదు. భారీ వాహనాలను జిలానీ సెంటర్ నుంచి వార్ఫ్ రోడ్ వైపుగా మళ్లిస్తున్నాం.

– నూని రమేష్, సీఐ ట్రాఫిక్–1, కాకినాడ

సందడి పేరుతో నిబంధనలు అతిక్రమించొద్దు



పండుగ సందడి పేరుతో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు. ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లు చప్పుళ్లు, అతి వేగంతో వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై పండుగ వేళల్లోనూ ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. క్రమశిక్షణతో కూడిన జీవన శైలితో సంక్రాంతి ప్రతి కుటుంబంలోనూ ఎనలేని కాంతులు ప్రసరించాలి.

– దామేటి రామారావు, సీఐ, ట్రాఫిక్–2, కాకినాడ

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ భావన

కమిషనర్ భావన

కాకినాడ: పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ భావన స్పష్టం చేశారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు కనిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం మూడో సర్కిల్ పరిధిలోని ఏడు, 8 డివిజన్ల పరిధిలో కమిషనర్ పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల సమీపంలో రహదారిపై చెత్త సేకరణ పనులపై ఆరా తీశారు. చెత్త సేకరణకు సంబంధించిన వాహనాలు సకాలంలో రాకపోవడాన్ని గుర్తించి సిబ్బందిని ప్రశ్నించారు. లోపాలను సరిదిద్దుకుని మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆమె వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఇతర సిబ్బంది ఉన్నారు.

రంగోలి పోటీలతో సృజనాత్మకత



విద్యార్థులకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

బాలాజీచెరువు: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందింపజేయడానికి రంగోలి పోటీలు దోహదపడతాయని వీబీవీఆర్ చారిట్రబుల్ ఫౌండేషన్ చైర్మన్ కంచర్ల సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎండోమెంట్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సైన్స్ రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ప్రతి పోటీలో పాల్గొనాలన్నారు. పోటీల్లో 154 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కేఎస్‌వీ ప్రసాద్, బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ, కేసరి శ్రీనివాసరావు, రత్నప్రసాద్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

కాకినాడ రూరల్: సర్పవరంలోని భావనారాయణ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్టు చెప్పారు. ఉదయం 5 గంటల నుండి భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశామన్నారు. సుమారు 50 మంది సేవా దళ్ కార్యకర్తల ద్వారా చంటి పిల్లలకు పాలు, బిస్కెట్లు, మంచి నీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్ పోలీస్ బందోబస్త్, ట్రాఫిక్ నియంత్రణను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దాతలతో ఉచిత ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపు ఉత్తర ద్వార దర్శనం

బోట్‌క్లబ్: స్థానిక సాంబమూర్తినగర్‌లో ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామి వారు రజత కవచ అలంకరణలో దర్శనం ఇస్తారని వారు తెలిపారు. తెల్లవారు జాము 5 గంటల నుంచి స్వామి వారి దర్శనం కల్పిస్తున్నామని, అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అంధుల జీవితాలకు వెలుగు బ్రెయిలీ

బోట్‌క్లబ్: అంధుల జీవితాల్లో వెలుగునింపిన బ్రెయిలీ చిరస్మరణీయుడని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. స్థానిక సాంబమూర్తినగర్‌లో అంధుల వసతి గృహం వద్ద లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం నిర్వహించారు. అంధుల పాఠశాల కో ఆర్డినేటర్ గణపతి మాట్లాడుతూ కరోనా సమయంలో హరీష్ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో యు.రాజు, ఎం బాపిరెడ్డి, అప్పలరాజు, గొర్రిపాటి రవీంద్రబాబు, రత్నరాజు పాల్గొన్నారు.



లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న తలాటం హరీష్

వికసిత్ భారత్ జాతీయ పోటీలకు అనుభార్గవి



విద్యార్థి అనుభార్గవిని అభినందిస్తున్న కళాశాల ఏడీ బీఈవీఎల్ నాయుడు

బాలాజీచెరువు: వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ 2025 జాతీయ స్థాయి పోటీలకు తమ విద్యార్థి ఎంపికైనట్టు ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు బుధవారం తెలిపారు. ఏఐ ద్వితీయ సంవత్సర విద్యార్థి ఎస్.అనుభార్గవి నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన 'భారతదేశాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ పవర్‌హౌస్‌గా మార్చడం' అనే అంశంపై రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి న్యూఢిల్లీలో ఈ నెల పదో తేదీ నుంచి నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీల ముగింపు రోజున ప్రధాని మోదీ సమక్షంలో తమ ప్రతిభను ప్రదర్శిస్తారన్నారు. అనుభార్గవిని కళాశాల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి, తేజేశ్వరరావు అభినందించారు.

రోగికి రక్తదానం

కరప: గ్రామానికి చెందిన ఓ రోగికి ఇద్దరు దాతలు ఏ పాజిటివ్ రక్తాన్ని అందజేశారు. కరప గ్రామస్తుడు వి.సింహాచలం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మెదడు సంబంధ వ్యాధితో చికిత్స పొందుతున్నాడు. శస్త్రచికిత్సకు అవసరమైన రక్తం కోసం మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలును సంప్రదించగా ఆయన సూచన మేరకు స్థానికులు పోలిశెట్టి సుధీప్, చొల్లంగి హరికిశోర్ బుధవారం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి రెండు యూనిట్ల రక్తదానం చేశారు. మూడోయూనిట్‌ను బ్లడ్‌బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ శ్రీహరిబాబు సమకూర్చినట్టు తాతీలు తెలిపారు.

భక్తులకు రుచికరమైన భోజనం

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తులకు అన్నదాన పథకంలో రుచికమైన భోజనం అందించాలని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అధికారులను ఆదేశించారు. స్వామివారి నిత్యాన్నదాన పథకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అహార పదార్థాల నాణ్యతపై అక్కడ భోజనాలు చేస్తున్న భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే దేవస్థానంలో అన్ని చోట్ల పెద్ద అక్షరాలతో వివిధ విభాగాలకు మార్గాలను సూచించే సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. తరువాత అన్నదానం స్టోర్స్, కిచెన్‌లను కూడా ఈఓ పరిశీలించారు. ఆయన వెంట పీఆర్వో కృష్ణారావు, ఏఈఓలు జగ్గారావు, శ్రీనివాస్, ఈఈలు రామకృష్ణ, నూకరత్నం, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తదితరులున్నారు.

జాతీయస్థాయికి ప్యానల్స్ ఫర్ క్రాప్ సైన్స్ ప్రాజెక్ట్



బలరామ్‌శివ రూపొందించిన ప్రాజెక్టు

తొండంగి: వ్యవసాయంలో రైతన్నకు తక్కువ కాలంలో అధిక దిగుబడి నిచ్చి, అధిక ధర కల్పించడమే లక్ష్యంగా బెండపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కంచి బలరాంశివ ప్యానల్స్ ఫర్ క్రాప్ సైన్స్ ప్రాజెక్టు రూపొందించాడు. ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల హెచ్‌ఎం నాగం కృష్ణమూర్తి తెలిపారు. విజయవాడలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2024–25లో బెండపూడి జెడ్పీ హైస్కూలు విద్యార్థి కంచి బలరాంశివ సోలార్ ప్యానల్స్ ఫర్ క్రాప్ ప్రాజెక్టును ప్రదర్శించగా ప్రథమ స్థానంలో నిలిచిందనన్నారు. అదేవిధంగా గ్రూప్ విభాగంలో డి.హరీష్, పి.తేజ్‌వర్ధన్ రూపొందించిన అబ్‌స్టాకిల్ డిటెక్షన్ కార్ ఫర్ ఆర్మీ ప్రాజెక్టు కూడా రాష్ట్రస్థాయి ప్రదర్శనలో గుర్తింపు పొందిందన్నారు. ఈ ప్రాజెక్టును ఈ నెల 20 వతేదీ నుంచి 24వ తేదీ వరకూ పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారతదేశ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించనున్నట్టు ఆయన వివరించారు. విద్యార్థులను, ఈ ప్రాజెక్టును మార్గదర్శకత్వం, పర్యవేక్షించి సహకరించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు కొత్ర సత్యశ్రీని పలువురు అభినందించారు.

యండమూరులో ఉచిత వైద్య శిబిరం



యండమూరులో కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కరప: మండలం యండమూరులో బుధవారం రాజమహేంద్రవారానికి చెందిన స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, కంటి వైద్య శిబిరాలను నిర్వహించారు. ఆ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తన తల్లిదండ్రులు, మావయ్య సాంబత్తుల వెంకట్రావు జ్ఞాపకార్థ ఈ శిబిరాలను నిర్వహించారు. వాణిజ్య పన్నుల అధికారి సాంబత్తుల వెంకటరావుతో కలసి మున్సిపాలిటీ విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ ఎంవీఆర్ మూర్తి ఈ శిబిరాలను ప్రారంభించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి వచ్చిన 300 మందికి వైద్య పరీక్షలు, 125 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మూర్తి, డాక్టర్ కృష్ణఅనూష, డాక్టర్ లలిత మనోజ్ఞ వైద్య సేవలందించారు. అవసరమైనవారికి మందులు ఉచితంగా అందజేశారు. 75 మందికి కళ్లజోళ్లు అవసరమవుతాయని గుర్తించామని, వారికి ఈనెల 19న అందజేయనున్నట్టు నిర్వాహకులు రాంబాబు తెలిపారు. సర్పంచ్ మార్నెళ్ల శివ, విశ్రాంత పోలీసు అధికారి పి.చంద్రరావు, పీఎంపీ జిల్లా సంఘం అధ్యక్షుడు బల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే నవోదయలో సీటు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీఓ అనుపమ

కరప: ప్రణాళికాబద్ధంగా చదివి నవోదయలో సీటు సాధించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ నవోదయ మోడల్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఐదో తరగతి చదువుతూ నవోదయ ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న 139 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షా విధానాన్ని, సంసిద్ధతను ఎంఈఓలు కృష్ణవేణి, సత్యనారాయణ వివరించారు. యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ సమకూర్చిన నోట్ ప్యాడ్స్, మెమెంటోలను ఎంపీడీఓ విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, సీఆర్పీలు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌లో జిల్లా జట్టు ప్రతిభ



రాష్ట్ర స్థాయి అండర్ 17 క్రికెట్ పోటీల్లో సత్తాచాటి మూడో స్థానంలో నిలిచిన తూర్పుగోదావరి జిల్లా జట్టు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలో బుధవారం జరిగిన అండర్–17 క్రికెట్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచింది. 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా తూర్పుగోదావరి జిల్లా జట్టు సత్తాచాటింది. కోచ్ తోట రవి ఆధ్వర్యంలో కెప్టెన్ పీఎస్ కశ్యప్, వైస్ కెప్టెన్ సాగర్‌కుమార్ ఇతర సభ్యులు మూడవ స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులను పలువురు అభినందించారు.